



వనస్థలిపురం నారాయణ పాఠశాలలో..



హస్తినాపురం అక్షర ఇంటర్నేషనల్ పాఠశాలలో..

సందడిగా సంక్రాంతి వేడుకలు

సైదాబాద్: మన సంస్కృతి సాంప్రదాయాలకు చిహ్నాలైన పండుగలు, వేడుకల ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు చిన్ననాటి నుండే తెలియజేయాలని కేంబ్రిడ్జ్ విద్యాసంస్థల అధిపతి కె.శంతన్‌కుమార్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సూచించారు. గురువారం కరణ్‌బాగ్‌లోని కేంబ్రిడ్జ్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. బాలురు పతంగులను తయారు చేసి ఉత్సాహంగా ఎగురవేస్తూ సందడి చేసారు. బాలికలు గ్రూపులుగా విడిపోయి పాఠశాల ప్రాంగణంలో వివిధ రంగులతో అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు.



రంగవల్లులను తీర్చిదిద్దిన కేంబ్రిడ్జ్ విద్యార్థినులు

హస్తినాపురం: హస్తినాపురం అక్షర ఇంటర్నేషనల్ పాఠశాలలో గురువారం సంక్రాంతి వేడుకలు సందడిగా జరిగాయి. ప్రిన్సిపాల్ రమణి వారణాసి వేడుకల్లో పాల్గొన్నారు.

హయత్‌నగర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హయత్‌నగర్‌లోని మెగాసిటీ పాఠశాలలో పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థినిలు పల్లె పడుచు వేషధారణలో విద్యార్థులు హరిదాసుల రూపంలో ఆకట్టుకున్నారు. ముగ్గుల పోటీలు, పతంగుల పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ సుబ్బారెడ్డి బహుమతులు అందజేశారు.



హస్తినాపురం రవీంద్రభారతి పాఠశాలలో..

వనస్థలిపురం: వనస్థలిపురంలోని నారాయణ పాఠశాలలో గురువారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు, చిన్నారులతో భోగి పండ్లు పోయడం, బొమ్మల కొలువు, గాలి పటాలు ఎగురవేయడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. విద్యాసంస్థ ఏజీఎం హేమంబర్, ఆర్ఐ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ భవానీ, వైస్ ప్రిన్సిపాల్ సుమ రాణి పాల్గొన్నారు.

రవీంద్రభారతి పాఠశాలలో...

వనస్థలిపురం డివిజన్ పరిధి హస్తినాపురం వెంకటరమణకాలనీలోని రవీంద్ర భారతి పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు.





విభిన్న ఫొటోలతో కూడిన పతంగులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న చరఖాలు, మాంజాలు

పతంగుల సందడి

వనస్థలిపురం: సంక్రాంతి వస్తోంది... సంబరాలు తెస్తోంది... సంక్రాంతి అంటేనే పతంగుల పండుగ. సంక్రాంతికి గాలిపటాలు ఎగురవేయడం ఆనవాయితీ. సంక్రాంతి రాకముందే ఈ పతంగుల జాతర మొదలవుతుంది. ఇక పండుగ రోజు పిల్లలు, పెద్దలు తేడాలేకుండా గాలిపటాలు తెచ్చుకుని పోటీలు పెట్టుకుని మరీ పతంగులను ఎగురవేస్తారు.ఆయా షాపుల్లో విభిన్న రంగులు, వింత వింత ఫోటోలు, వెరైటీ నమూనాలతో కూడిన పతంగులు దర్శనమిస్తున్నాయి. ఆకర్షణీయమైన పతంగులను కొనడానికి యువత ఆసక్తి చూపుతోంది.



వనస్థలిపురంలో పతంగులు కొంటున్న స్థానికులు



సందడి చేసిన విద్యార్థులు

వనస్థలిపురం: లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూలు వనస్థలిపురం, కమలానగర్, హయత్‌నగర్, తుర్కయంజాల్ బ్రాంచిల రజతోత్సవ వేడుకలను బుధవారం రాత్రి ఓ ఫంక్షన్‌హాలులో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సీ.హెచ్.గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ ఎంతో ముఖ్యమని, ఈ పోటీ ప్రపంచంలో ఇతరులకు ధీటుగా రాణిస్తేనే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమని అన్నారు. డీసీపీ బి.సాయిశ్రీ, విద్యాసంస్థ చైర్మన్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

- ఎనిమిది మంది అరెస్టు
- 24 కిలోల గంజాయి స్వాధీనం

అబ్దుల్లాపూర్‌మెట్: ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే బస్సుల్లో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఎనిమిది మంది ముఠా సభ్యులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద రూ.7లక్షల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. హయత్‌నగర్ ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌గౌడ్ తెలిపిన మేరకు.. ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ శాఖ అధికారులు తెల్లవారుజామున అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఫిల్మ్‌సిటీ గేట్ ఎదుట ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల తనిఖీలు చేపట్టారు. జిల్లా డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు, హనుమంతరావు నేతృత్వంలో ఆంధ్రా, ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు.



పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి

ఈ సమయంలో ఎనిమిది మంది ప్రయాణికుల నుంచి 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.7 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. గంజాయిని సరఫరా చేస్తే ఒక్కొక్కరికి రూ.10 వేలు కమీషన్ ఇస్తామని చెప్పడంతోనే ఇలా చేస్తున్నామని పట్టుబడిన యువకులు తెలిపారన్నారు. ఈ దాడుల్లో సరూర్‌నగర్ డీటీఎఫ్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు వెంకన్న, జి.హనుమంతు, జి.సరళ, ఎండీ పాష, హనుమంతు సరూర్ నగర్ డివిజన్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో రాజ్యాంగ ఉల్లంఘన

మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేటు స్కూళ్లలో యథేచ్ఛగా రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని, బాధ్యతాయుత పదవిలో ఉన్న అధికారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని బీఎస్పీ కార్మిక విభాగం రాష్ట్ర ఇన్‌చార్జి చోళ్లేటి మహేష్‌బాబు విమర్శించారు. ఎల్‌బీనగర్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖ అధికారులు ప్రైవేటు యాజమాన్యాలు ఇచ్చే ముడుపులకు ఆశపడి నిబంధనలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు స్కూళ్లలో జరుగుతున్న రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనకు స్కూళ్ల యాజమాన్యాలతో పాటు విద్యాశాఖ అధికారులు కూడ బాధ్యులని. ప్రభుత్వం స్పందించి వారిపై న్యాయపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన సీపీ

నాగోలు: రాచకొండ పోలీస్ కమీషనర్ జి.సుధీర్‌బాబు బుధవారం రాత్రి ఆకస్మికంగా నాగోలు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలను నాగోలు సీఐ వెంకటేశ్వర్లను అడిగి తెలుసుకున్నారు. నాగోలు పోలీస్‌స్టేషన్ వివిధ కాలనీల వివరాల తెలుసుకున్నారు. అక్కడ పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ సామాన్య ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత మనందరికి పైన ఉందని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారిని గౌరవిస్తూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని వెల్లడించారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాస్, మహిళ కానిస్టేబుల్ మౌనికగౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి క్రైస్తవులు ఐక్యతను చాటాలి



సమావేశానికి హాజరైన పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చిలో గురువారం మలక్‌పేట నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. నూతన సంవత్సరంలో మొదటి సమావేశం సందర్భంగా ఉదయ కాలపు ఆరాధన నిర్వహించారు. చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ బోడ సాల్మన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యం అబ్రాహాం మాట్లాడుతూ.. సమాజంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలన్నారు. సమావేశంలో రెవరెండ్ డాక్టర్ మెస్నో జోయల్, బిషప్ ఎం.ఎస్ దయానంద్, అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అనిత షీబరాణి, పాస్టర్ రెవరెండ్ యిర్మీయా, డేవిడ్, చర్చిల పాస్టర్లు, పెద్దలు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

- ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి



వెంకట్‌రెడ్డి

పహాడీషరీఫ్: సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు ఇంట్లోని విలువైన వస్తువులు, నగదును బ్యాంక్ లాకర్లలో దాచుకోవాలని బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడుతూ పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచాలని, బయట గేట్‌కు లోపల తాళం వేయాలని, ఇంట్లో ముందు గదిలో లైట్ వేసి ఉంచాలని సూచించారు. ఊరికి వెళ్లేటప్పుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. బయటికి వెళ్లేటప్పుడు, వాకిట్లో ముగ్గులు వేసేటప్పుడు మెడలోని బంగారు ఆభరణాలు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే దయల్-100 లేదా 87126 62666 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

నాగోలు: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఓం శ్రీ మాత్రే నమః మహిళా సంఘం రెండవ వార్షికోత్సవం గురువారం కొత్తపేట శ్వేతా గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. చైతన్యపురి కార్పొరేటర్ నరసింహగుప్త తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త

రౌడీ షీటర్ దారుణ హత్య

- మాట్లాడుకుందామని పిలిచి కత్తులు, కర్రలతో దాడి
- మర్మాంగాలు కోసిన ప్రత్యర్థులు
- 23 కేసుల్లో నిందితుడిగా ఉన్న హతుడు ముబీన్

పహాడీషరీఫ్: రౌడీ షీటర్ దారుణ హత్యకు గురైన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట అబూబకర్ కాలనీకి చెందిన మహ్మద్ ముబారక్ సిగర్ అలియాస్ ముబీన్(33) బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా నమోదై ఉన్నాడు. యుక్త వయసు నుంచే నేరబాట పట్టిన ఇతనిపై ఇప్పటి వరకు 23 కేసులు నమోదయ్యాయి. ఇందులో మూడు హత్య (పహాడీషరీఫ్ (2010లో), రాజేంద్రనగర్, బండ్లగూడ ఠాణాల పరిధి), మూడు హత్యాయత్నం, ఏడు చోరీ, మూడు ఆయుధ దుర్వినియోగం, రెండు కిడ్నాప్, ఐదు గొడవలకు సంబంధించిన కేసులున్నాయి. ఎవరిని పడితే వారిని బెదిరించడం.. నగదు, బైక్‌లు, సెల్‌ఫోన్లు లాక్కోవడం వంటివి చేస్తుంటాడు. ఎర్రకుంటలో గత నెల 8న పదిహేడేళ్ల బాలుడిని కిడ్నాప్ చేయడంతో బాలాపూర్ పోలీసులు అతన్ని రిమాండ్‌కు తరలించారు. కొద్ది రోజులకే జైలు నుంచి వచ్చిన ముబారక్ ఫలక్‌నుమా పీఎస్ పరిధిలో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఆరు రోజుల అనంతరం జైలు నుంచి విడుదలయ్యాడు. పోలీస్ స్టేషన్‌కే తలనొప్పిగా మారిన ఇతడు చట్టాల్లోని లొసుగులతో తరచూ బెయిల్‌పై విడుదలై నేర ప్రవృత్తిని కొనసాగిస్తూ వస్తున్నాడు. ఇదిలా ఉండగా రాజేంద్రనగర్, లంగర్‌హౌస్ ప్రాంతాలకు చెందిన ఇద్దరు రౌడీ షీటర్లతో ఇతనికి పాత గొడవలున్నాయి. రౌడీషీటర్లతో పాటు వారి అనుచరులకు సంబంధించి గతంలో బైక్‌లు, సెల్‌ఫోన్లు, కొంత నగదు కూడా తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య పరిచయస్తులు మాట్లాడుకుందామంటూ ముబారక్‌ను బుధవారం అర్ధరాత్రి వాదే ముస్తఫాలోని మదీనా మజీద్ ప్రాంతానికి పిలిపించారు. అక్కడికి చేరుకున్నాక మాట్లాడుకునే క్రమంలో మాటామాటా పెరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన ప్రత్యర్థి వర్గం ముబారక్‌పై కత్తులు, కర్రలతో విచక్షణా రహితంగా దాడికి పాల్పడింది. అంతటితో ఆగకుండా అతని మర్మాంగాలను కూడా కోసేశారు. దీంతో ముబారక్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెంటనే మహేశ్వరం డీసీపీ డి.సునితారెడ్డి, అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ శ్రీనివాస్ యాదవ్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్‌రెడ్డి, అదనపు ఇన్‌స్పెక్టర్ మధు ఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. ఘటనా స్థలంలో కర్రలు, పగిలిన మద్యం బాటిళ్లు పడి ఉన్నాయి. వెంటనే డాగ్ స్క్వాడ్‌ను రప్పించి నిందితుల కోసం గాలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. హత్య చేసిన వారిలో ఆదిల్, అమీర్, హుస్సేన్‌లతో పాటు మరికొందరు ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివాహేతర సంబంధాలు ఏవైనా ఉన్నాయా..? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. దీనికి తోడు హతుడికి హోమో సెక్సువల్స్‌తోనూ సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ముబీన్‌కు గతంలో వివాహం జరగగా ఇతడి ప్రవర్తనకు విసిగిపోయిన భార్య వదిలివెళ్లిపోయింది.



ముబీన్(ఫైల్)

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ ఆడుతున్న శ్రీశైలం గౌడ్

మహేశ్వరం: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయని అమీర్‌పేట్ గ్రామ సర్పంచ్ శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో ఏపీఎల్ (అమీర్‌పేట్ ప్రీమియర్ క్రికెట్ లీగ్) పోటీలను స్థానిక ఎంపీటీసీ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, క్రీడాకారులతో కలిసి పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటా ఇచ్చి ప్రోత్సహిస్తోందన్నారు. యువత అన్ని రంగాల్లో ముందుండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోతుల నర్సింగ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాయప్ప, కాంగ్రెస్ నాయకులు చాకలి యాదయ్య, ఆవుల యాదయ్య, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు , క్రీడాకారులు, ఆర్గనైజర్స్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. సామసరస్వతి 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సామసరస్వతి నగర్, క్రాంతినగర్, లక్ష్మీనగర్, మైత్రిపురం, ఉదయ్‌నగర్, బాలాజీనగర్, కాలనీలతోపాటు శ్రీనివాసనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శ్రీనివాసనగర్, సాయిరాంనగర్, తపోవన్, గ్రీన్‌పార్కు కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

చైతన్యపురి: డివిజన్‌లోని పలు సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తను కోరారు. గురువారం అయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి డివిజన్‌లోని సమస్యలను ఎమ్మెల్సీకి వివరించారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, వంశీకృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 19, వంకాయ 28, బెండ 45, పచ్చిమిర్చి45, కాకర 52, బీర 45, క్యాలిఫ్లవర్ 23, క్యాబేజీ 19, కారెట్ 31. దొండ 35, ఆలు 25, ఉల్లి 26, గోకర 50, దోస 28, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 55, మునగ 65, చిలగడదుంప 50, బీట్‌రూట్ 17, కీర 17, ఫ్రెంచ్ బీన్స్ 40, కాప్సికమ్ 60. ఈధరలు శుక్రవారం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

బ్రిడ్జి విస్తరణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించటానికి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో అధ్యయనం చేసి రహదారుల విస్తరణ చేస్తున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్ చెరువు కట్ట పై బ్రిడ్జ్ వెడల్పు పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్, గాంధీ బొమ్మ తదితర ప్రాంతాల్లో రోడ్లు విస్తరణ వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు అధిగమించవచ్చన్నారు. ఈఈ శ్రీనివాస్, ఏఇ ప్రశాంతి, మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత



లింగోజిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కాంగ్రెస్ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. చంపాపేటకు చెందిన జగదీశ్ గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. తన వైద్యానికి సహకరించాలని రాజశేఖర్‌రెడ్డికి విన్నవించడంతో స్పందించిన అయన సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించాడు. జగదీశ్ వైద్యం నిమిత్తం రూ.1.50లక్షల ఎల్‌ఓసీ లెటర్ మంజూరు కావడంతో ఆ లెటర్‌ను గురువారం రాజశేఖర్‌రెడ్డి జగదీశ్‌కు అందజేశారు.

రోడ్లపై నీటి వృథాగా వదిలేస్తే చర్యలు



విద్యార్థులతో మాట్లాడుతున్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: రోడ్లపై నీరు వృథాగా వదిలేస్తే చర్యలు తీసుకుంటామని, పలువురు రోడ్లపై నీరు వదలడంతో బురదగా మారి ప్రయాణీకులకు ఇబ్బందికరంగా ఉంటుందని కాంగ్రెస్ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని కాకతీయ కాలనీలోని ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలోని రోడ్డులో నీటిని వృథాగా వదలడంతో పాఠశాల విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఆయన గురువారం విద్యార్థులతో కలిసి కాలనీలో పర్యటించారు. నీటిని వృథా చేస్తున్న వారి మంచి నీటి సరఫరను నిలిపివేసే విధంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వివేకానంద జయంత్యుత్సవాలను జయప్రదం చేయండి

మన్సూరాబాద్: జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా మన్సూరాబాద్ సహారారోడ్డులోని వివేకానంద విగ్రహం వద్ద శుక్రవారం వివేకానంద జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి తెలిపారు. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా మాజీమంత్రి, బీజేపీ నాయకులు ఈటెల రాజేందర్ హాజరవుతారన్నారు.

గుంతలు పూడ్చారు



జేసీబీతో గుంతల పూడ్చివేత పనులు

బడంగ్‌పేట్: రోడ్డంతా గుంతలే.. శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించారు. కొత్త మునిసిపల్ కార్పొరేషన్ నుంచి అల్మాస్‌గూడ రాజీవ్‌గృహకల్ప వెళ్లే ప్రధాన దారిలో ఉన్న 23, 28 డివిజన్లలోని మారుతినగర్ రోడ్డు గుంతల మయంగా మారింది. డ్రైనేజీల పేరుతో అడ్డంగా తవ్విన బీటీ రోడ్డుపై పెద్ద గుంతలు పడటంతో వాహనదారులు, పాదచారులు, ద్విచక్రవాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై సాక్షిలో కథనం రావడంతో స్పందించిన అధికారులు జేసీబీతో తరలివచ్చి గుంతలను పూడ్చివేయించారు. పదిహేను రోజుల్లో సీసీ నిర్మాణ పనులు చేపడుతామని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, కాలనీవాసులు, వాహనదారులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.